సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 17 । జూలై । 2024



అమ్మవారి ఆలయంలో చోరీ

కాగువాడ అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించారు.

- 8లో



క్షణికావేశంలో ఆత్మహత్య

క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నుందరాడ గ్రామంలో ఘటన జరిగింది.

- 8లో

23 నుంచి ప్రత్యేక బీఎడ్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న మెంటల్లీ రిటార్డ్ కోర్సుకు సంబంధించి ప్రత్యేక బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 29వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9 గంటలు నుంచి 12 గంటల వరకు వర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఇయర్ అండ్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం డిగ్రీ (బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ) ఇయర్ అండ్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్ష నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం తెలిపారు. 2011 నుంచి 2015 మధ్య ఏడాదుల్లో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో బుధవారం నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఫీజు సైతం 14వ తేదీలోపు చెల్లించాలని, ఆగస్టు 20 నుంచి హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయోగ పరీక్షలు ఆగస్టు 22 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 3వ తేదీ నుంచి థియరీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఫీజులు మూడో ఏడాదికి రూ. 10 వేలు, రెండు, మొదటి ఏడాదిలకు రూ.8000, పేపర్ల వారీగా పేపరుకు రూ.మూడు వేలు, ప్రయోగాలకు మొత్తం సబ్జెక్టులకు రూ.10 వేలు, ఒక సబ్జెక్టు ప్రాక్టికల్‌కు రూ.3 వేలు, ప్రాజక్టు వైవా వాయిస్‌కు రూ.3వేలుగా చెప్పారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

భారీ కొండచిలువ హతం



భారీ కొండచిలువ చేతిలో హతమైన మేక

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ పరిధిలో ఉన్న కోశారింగుతాళ్ల పద్ర గిరిజన గ్రామం సమీపంలో రాయగోడు మూల రిజర్వ్ ఫారెస్టులో దాదాపు 25 అడుగుల కొండ చిలువ కనిపించింది. మంగళవారం ఉదయం పలాస మండలం రెంటికోట గ్రామం నుంచి మేకల కాపరులు మేతకు పశువులను తీసుకెళ్లగా మేకలన్నీ ఒక్కసారిగా పరుగులు పెట్టాయి. పెద్ద పులి అనుకుని కాపరులు కూడా భయపడ్డారు. కానీ దాని ఆనవాలు కనిపించకపోవడంతో కత్తులు, కమ్మకత్తులతో ముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే పాతిక అడుగుల కొండ చిలువ నల్లటి మేకను పట్టుకుని చుట్టేసింది. దీంతో కాపరులు భయపడుతూనే దాన్ని విడిపించే ప్రయత్నం చేయగా.. భారీ సర్పం వారిపై బుసలు కొట్టింది. దీంతో కమ్మ కత్తులతో పామును హతమార్చారు. ఇంత పొడవైన పామును తామెప్పుడు చూడలేదని మేకల కాపరులు తెలిపారు.

శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

కోటబొమ్మాళి: వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశాలపై కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఏడుగురిని, నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి సోమవారం తొలగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్ మంగళవారం విలేకరులకు తెలిపారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించినట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

నేడు జిల్లా రోల్‌బాల్ జట్ల ఎంపికలు



రోల్‌బాల్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా రోల్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా రోల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. పలాసలోని మదర్ థెరిస్సా స్కూల్ ప్రాంగణంలో ఉన్న గోపిచంద్ రోలర్ స్కేటింగ్ క్లబ్ వద్ద ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. మొత్తం నాలుగు వయో విభాగాల్లో ఎంపికలు జరగనున్నాయి. అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-17 పైబడి వయస్సు కలిగిన బాలబాలికలకు ఈ ఎంపికలను నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్న ఏపీరాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రోల్‌బాల్ సంఘ బాధ్యులు పంపించనున్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలబాలికలు తమ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం/టెన్త్‌క్లాస్ మార్క్స్ మెమో, 3 పాస్ ఫొటోలు, పూర్తి రోల్‌బాల్ కిట్‌తో హాజరుకావాలని కిరణ్‌కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు 92909 05399 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మబ్బు చాటున..



ఆకాశంలో వర్ణాలు చూపరులను ఆహ్లాదపరిచాయి. మబ్బుల చాటు నుంచి రకరకాల రంగులు ప్రకాశవంతంగా కనిపించడంతో టెక్కలి వాసులు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో ఆ దృశ్యాలను బంధించారు.

- టెక్కలి రూరల్

కుండపోత

ఎల్ఎన్ పేట మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. కోవిలాం వద్ద అలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డుకు ఎగువ వైపున ఉన్న సుమారు వంద ఎకరాల పంటపొలాలు నీటమునిగాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభంలోనే ఇలా జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వేసుకుని నెల రోజులు కూడా పూర్తి కాలేదని, మొక్కదశలో ఉన్న పంట పొలాలు నీట మునగటంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వల్ల మిగిలిన ప్రాంతాల రైతులకు మేలు జరిగినప్పటికీ కోవిలాం గ్రామానికి చెందిన రైతులు తీరని నష్టం మిగిల్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఎల్.ఎన్.పేట



ఎంతకాలమో ఈ నిరీక్షణ

అర్హుల జాబితా ఎప్పుడో సిద్ధమైంది. కావాల్సిన నగదు ఎన్నికల ముందే రెడీ అయిపోయింది. కానీ చేయూత లబ్ధిదారులకు ఇంకా న్యాయం జరగలేదు. కూటమి నాయకుల ఫిర్యాదు కారణంగా ఆనాడు ఆడపడుచులకు అందాల్సిన సాయం నిలిచిపోగా.. అదే పార్టీ నేతల అలసత్వం కారణంగా నేడు నిరీక్షణ తప్పడం లేదు. నిర్దిష్టమైన తేదీ చెప్పి అదే సమయానికి గత ప్రభుత్వం చేయూత సాయం అందించడం మొదలుపెట్టేది. మూడేళ్ల పాటు ఈ క్రతువు నిర్విఘ్నంగా సాగింది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

- చేయూత నగదు కోసం మహిళల ఎదురు చూపు
- రూ.18,750 సాయం కోసం నిరీక్షణ
- గత ప్రభుత్వ హయాంలోనే కసరత్తు పూర్తి



శ్రీకాకుళం పాతబస్టాండ్:

చేయూత సాయంపై జిల్లా మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల కమిషన్‌కు కూటమి నాయకులు చేసిన ఫిర్యాదుల కారణంగా జిల్లాలో 40 శాతం మంది మహిళలకు మాత్రమే చేయూత సాయం అందింది. మిగిలిన వారికి సాయం అందించాల్సిన కొత్త సర్కారు దాని ఊసెత్తకపోవడంతో మహిళలకు ఎదురు చూపులు తప్పడం లేదు.

ఇచ్చిన మాట ప్రకారం..

2019 ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వరుసగా మూడేళ్లు వైఎస్ఆర్ చేయూత పేరిట 45 నుంచి 60 ఏళ్ల వయస్సు మహిళలకు ఏటా రూ.18,750లు ఆర్థిక సాయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. ఈ డబ్బు సాధారణ నిరుపేద కుటుంబాల మహిళలకు ఎంతగానో ఉపయోగపడింది. మూడు విడతల్లో ముందుగానే ఓ తేదీ చెప్పి ఎవరి మధ్యవర్తిత్వం లేకుండా మహిళల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. అయితే చివరి ఏడాది 2024లో కూడా ఈ పథకాన్ని నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. పూర్తిస్థాయిలో నిధులు కూడా కేటాయించారు. అంతలోనే ఎన్నికలు రావడంతో తొలివిడతలో కొందరికి నగదు జమై.. అక్కడితో ఆగిపోయింది. ఎన్నికల ముందు టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసి మహిళలకు ఈ డబ్బులు చేరకుండా చేశారు.

ఎన్నికల అనంతరం మహిళలంతా ఈ పథకం నగదు వస్తుందని ఆశించారు. కానీ కొత్త ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. చేయూత నగదుపై ప్రభుత్వం ఏమీ మాట్లాడడం లేదు. అధికారుల వద్ద కూడా దీని గురించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం..

వైఎస్సార్ చేయూత పథకం ఇప్పటికే సుమారుగా 40 శాతం మంది మహిళలకు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన వారికి కూడా పడే అవకాశం ఉంది. ఇంకా ఎంతమందికి ఈ మొత్తం పడలేదో వారి వివరాలు సేకరిస్తున్నాం. కొన్ని మండలాల నుంచి వచ్చాయి.

– సీహెచ్ రామ్మోహనరావు, డీపీఎం

మూడేళ్లు నిర్విఘ్నంగా..



వైఎస్ఆర్ చేయూత పథకం మూడేళ్లు నిర్విఘ్నంగా సాగింది. 2020-21లో జిల్లాలో 1,54,490 మంది లబ్ధిదారులకు రూ.280.57 కోట్లు వేశారు. 2021-22లో 1,59,968 మందికి గాను రూ. 290.83 కోట్లు వారి ఖాతాల్లో జమచేశారు. 2022-23 సంవత్సరంలో 1,69,767 మందికి గాను రూ.319.14 కోట్లు అందజేశారు. 2023-24లో 177314 మందికి రూ.332.46 కోట్లు జమ చేసేందకు సిద్ధం కాగా ఇందులో ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి 40 శాతం మంది మహిళలకు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమైంది. మార్చి 7న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేయడం ప్రారంభించగా.. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో కూటమి నాయకులు ఈ పథకం నగదు జమ కానీయకుండా ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసి అడ్డుకున్నారు. ఎన్నికల తర్వాతైనా వారికి లబ్ధి చేకూర్చలేదు. లబ్ధిదారుల్లో బీసీ మహిళలు 1,52,641 మంది, ఎస్సీలు 15,277 మంది, ఎస్టీలు 6912 మంది, మైనారిటీలు 395, ఇతరులు 2095 మంది ఉన్నారు. వీరిలో కేవలం 40 శాతం మందికి మాత్రమే నగదు అందింది.

19న శ్రీకాకుళంలో జాబ్‌మేళా



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ హాస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణ సంస్థలో ఈనెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. సంగీత మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్స్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్ పోస్టుల ఖాళీలకు, అలాగే అమెజాన్ (కేఎల్ గ్రూప్స్) సంస్థలో పికింగ్, ప్యాకింగ్, లోడింగ్, అన్‌లోడింగ్, స్కానింగ్, సార్టింగ్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులు అర్హులు కాగా సంగీత మొబైల్స్‌కు ఎంపికైన వారు శ్రీకాకుళం, పాలకొండ, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, విజయనగరం, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అలాగే అమెజాన్‌కు ఎంపికైనవారు హైదరాబాద్, చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందని ఉపాధి అధికారి సుధ వెల్లడించారు. ఎంపికైన వారికి ఆకర్షణీయమైన జీతంతోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

20 నుంచి పశువులకు ముద్ద చర్మ వ్యాధి టీకాలు



మాట్లాడుతున్న జేడీ జయరాజు

జలుమూరు: జిల్లాలో ఆవులకు సంక్రమించే ముద్ద చర్మ వ్యాధి నివారణకు ఈ నెల 20 నుంచి ఆగస్టు 18 వరకూ ప్రత్యేక బృందాలతో టీకాలు వేయనున్నామని పశుసంవర్ధక శాఖ ఇన్ చార్జి జేడీ జయరాజ్ తెలిపారు. ఆయన మంగళవారం జలుమూరు పశువైద్యశాలను సందర్శించిమాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 3.32,100 ఆవులకు ఈ టీకాలు వేసేందుకు అంతా సిద్ధం చేశామన్నారు. నాలుగు నెలల వయసు గల దూడల నుంచి ఈ టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. ఆవు మృతి చెందితే అందే పరిహారం కోసం ఉన్న పశు బీమా పథకం కొనసాగుతుందని తెలిపారు. ఆయనతో పాటు వైద్యులు పట్ట సంతోష్, ఎం.దీప్తి, మాను కొండ ఫెడరిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ సిబ్బంది ఆరోపణలపై విచారణ



విచారణ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుజాత తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పలువురు సిబ్బంది ప్రవర్తన, చేతివాటాలపై వచ్చిన పలు ఆరోపణలపై దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్, డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌ల సమక్షంలో ఆలయంలో పనిచేస్తున్న పలువురు దినసరి వేతనదారులను పిలిపించి మాట్లాడి, వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అలాగే దినసరి కూలీల డ్యూటీలపైన కూడా ఆరా తీసి ఆలయ ఈఓ చంద్రశేఖర్ నుంచి కూడా స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఇటీవల కాలంలో ఓ పత్రికలో ప్రచురించిన వరుస కథనాల నేపథ్యంలో ఈ విచారణ జరిగిందని తెలుస్తోంది. అయితే కేవలం ఆరోపణలు, పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా విచారణ చేపట్టినట్లుగా అధికారులు ధ్రువీకరించారు. తుది రిపోర్టును దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు నివేదిస్తామని సుజాత తెలియజేశారు.

అను'మతి' లేకుండా..



తరలించడానికి సిద్ధం చేసిన ఇసుక (ఇన్‌సెట్లో) ర్యాంపు వద్ద కాపలాగా పోలీసులు

అర్ధరాత్రి అయితే చాలు.. ఇక్కడ ట్రాక్టర్ల చప్పుళ్లు జోరందుకుంటాయి. ఊళ్లన్నీ నిద్రపోయాక.. ఇసుకాసురుల వికృత విన్యాసాలు ఊపందుకుంటాయి. నిబంధనలంటూ ఏమీ లేవు. అనుమతులు అసలే లేవు. వంశధార కన్నీళ్లు పెట్టేలా తవ్వుకోవడం, ఖజానాలు నింపుకునేలా అమ్ముకోవడం ఇక్కడ పరిపాటి. ఇది సరుబుజ్జిలి మండలం పెద్దసవాళపురంలోని అనధికార ఇసుక ర్యాంపు వద్ద పరిస్థితి. అధికారం చేతికి వచ్చాక టీడీపీ నాయకులు ఇక్కడ రెచ్చిపోతున్నారు. ఎంతలా అంటే.. 'నిన్న మొన్న వచ్చిన చోటా నాయకులకే అన్నీ అప్పగించేస్తున్నారు.. మా పరిస్థితి ఏంటి' అని సీనియర్ టీడీపీ కార్యకర్తలు ఆక్రోశం చెందేలా ఇక్కడ అక్రమాలు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదుతో పోలీసులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు.

– సరుబుజ్జిలి

'పలాస రిజిస్ట్రార్ కార్యాలయంపై దర్యాప్తు చేస్తున్నాం'



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు

కాశీబుగ్గ: పలాస రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాలు తీసుకోవడం వంటి దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని, ఆ కార్యాలయంపై దర్యాప్తు చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు అన్నారు. మందస రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. క్రయవిక్రయదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా వేగంగా సర్వీసు అందించాలని సూచించారు. కార్యాలయాలు తనిఖీ చేస్తున్నామని, కంప్యూటర్ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. జిల్లాలో 13 కార్యాలయాల్లో రోజుకో చోట తనిఖీ స్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలో పొజిషన్ సర్టిఫికెట్, వన్‌బీ, వారసత్వ భూముల కోసం లింకు డాక్యుమెంట్లు ఉండాలని తెలిపారు. అన్ని రకాలు ఉన్నప్పటికీ ఇంకేమైనా లంచాలు అడిగితే జిల్లా కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కోరారు.

జమ్మూ ఉగ్ర దాడిలో చెట్లతాండ్ర జవాన్ వీరమరణం



మృతి చెందిన రాజేష్

సంతబొమ్మాళి: జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో చెట్లతాండ్ర గ్రామానికి చెందిన డొక్కరి రాజేష్ (25) అనే జవాన్ వీరమరణం పొందారు. రాజేష్ ఐదేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. కుటుంబానికి అండగా ఉండే కుమారుడు ఇలా ఉగ్రవాదుల చేతిలో మరణించడంపై తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి విలపిస్తున్నారు. రాజేష్‌కు డిగ్రీ పూర్తి చేసిన తమ్ముడు మధుసూదనరావు ఉన్నారు. రాజేష్ మృతితో కుటుంబం, గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

శతక్కొట్టాడు



సెంచరీ సాధించిన నంబల్ల సుశాంత్

- సెంచరీతో అదరగొట్టిన సుశాంత్
- ఏసీఏ అంతర్‌జోనల్ మ్యాచ్‌ల్లో రాణింపు
- మరోసారి ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్టార్ ఆల్‌రౌండర్ నంబల్ల సుశాంత్ మరోసారి శతక్కొట్టాడు. ఏసీఏ అంతర్ జోనల్ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో అజేయ సెంచరీతో కదంతొక్కాడు. గత కొన్నేళ్లుగా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణిస్తూ.. అత్యద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్న సుశాంత్ ఈ సీజన్‌లోనూ తన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న అంతర్‌జోనల్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నంబల్ల సుశాంత్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచా డు. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యేందుకు నిర్వహించిన ఈ టోర్నీలో చూడచక్కటి ఆటతీరుతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టును సుశాంత్ భారీ ఓటమి నుంచి గట్టెక్కించాడు. మిగిలిన బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడంతో ఒంటరి పోరాటం చేయడంతో ఆ జట్టు 50 ఓవర్లలో 202 పరుగులు చేయగలిగింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ సుశాంత్ 16 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 121 పరుగులతో నాటౌట్‌గా నిలవడం విశేషం. సుశాంత్ స్వస్థలం జిల్లాలోని టెక్కలి పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ. ప్రస్తుతం శ్రీకాకుళంలోనే నివాసం ఉంటున్నారు. తండ్రి నంబల్ల జగదీష్ రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి అర్చన గృహిణి.



అంతర్‌రాష్ట్ర టోర్నీలో సుశాంత్‌కు క్యాప్‌ను అందజేస్తున్న కోచ్

క్రికెట్ సంఘం అభినందన..

ఏసీఏ అంతర్‌జోనల్ క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన నంబల్ల సుశాంత్ అజేయ సెంచరీ సాధించడంపై జిల్లా క్రికెట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పీఎల్ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ రవికుమార్ తదితరు లు అభినందించారు.

గత కొన్నేళ్ల నుంచి సుశాంత్ అద్భుతమైన ఆటతీరుతో రాణిస్తుండటం శుభపరిణామమని కొనియాడారు. సుశాంత్ రాణింపు పట్ల తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు సంతోషం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

సోలార్ ప్యానెళ్ల చోరీ కేసులో 8 మంది గుర్తింపు

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామంలో చొక్కర అప్పలనాయుడికి సంబంధించిన 8 సోలార్ ప్యానల్‌లు, నామాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటసత్యంకి చెందిన 5 సోలార్ ప్యానళ్లను దొంగిలించడంపై వారు ఇటీవల స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది కొంత మంది నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కేసుల్లో 8 మందిని గుర్తించినట్లు ఎస్‌ఐ జీవీ ప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. 13 సోలార్ ప్యానెళ్లు రికవరీ చేసినట్లు ఆయన తెలియజేశారు. నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించి, వారికి సహాయం అందించిన వారికి కూడా విచారణ చేశారు.

ఎత్తిపోతల విద్యుత్ పరికరాల దొంగతనంపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: నారాయణవలస ఎత్తిపోతల పథకానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్– కూలింగ్ ఆయిల్, ఇతర పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఏపీఐడీసీ ఏఈ జి.మధుసూదనరావు మంగళవారం కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పథకాన్ని పరిశీలించేందుకు వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి విలువైన సామగ్రి దొంగిలించినట్లు గుర్తించామన్నారు. గత నెల 24 నాటికి పరికరాలన్నీ సక్రమంగా ఉన్నాయని, లిఫ్ట్ కూడా పనిచేస్తోందని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు.

యోగా కో ఆర్డినేటర్ నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగా ఫిట్‌నెస్ మేనేజ్ మెంట్ కోర్సు కో ఆర్డినేటర్‌గా టీచింగ్ అసిస్టెంట్ కేవీఎస్ మూర్తిని నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ పి.సుజాత ఉత్తర్వులు జారీచేశారు. ఏడాది కాల పరిమితికి నియమించారు. ఉత్తర్వులను వీసీ కె.ఆర్.రజిని అందజేశారు.

'దేశంలో సామాజిక విప్లవం రావాలి'

కాశీబుగ్గ: దేశంలో సామాజిక విప్లవాన్ని తీసుకురావాలని, అది కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక టీకేఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు సామాజిక ఉద్యమంతో అసమానతలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలు ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని అన్నారు. 99 ఏళ్ల రాజకీయ చరిత్రలో అనేక పోరాటాలు నడిపిన కమ్యూనిస్టు పార్టీని పటిష్టం చేసుకోవడానికి మార్గాలు అన్వేషించాలన్నారు. అనంతరం రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యులు కె.ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పాలనను ఎండగట్టారు. జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, సనపల నర్సింహులు, ఎం.యుగంధర్, ఆర్లేశమ్మ, కొన్న శ్రీనివాసరావులు ప్రసంగించారు.

రీ పేమెంట్‌కు మూడు విధానాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్త్రీనిధి రుణం పొందిన మహిళా సంఘాల సభ్యులు వారి అప్పును తిరిగి వాయిదాల్లో చెల్లించేందుకు మూడు విధానాలు ఉన్నాయని స్త్రీనిధి ఏజీఎం బి.సత్యనారాయణ తెలిపారు. ఆటో డెబిట్, పేటీఎం రికవరీ, సంఘంలోని లీడర్లు, గ్రామ సంఘం ద్వారా చెల్లింపులు చేసే విధానం ఉందని, మూడింటిలో సంఘాలు ఒక విధానంలో చెల్లించవచ్చని తెలిపారు. ఆటో డెబిట్ వల్ల పుస్తక నిర్వహణ భారం, మధ్యవర్తులు లేకుండా పేమెంట్ ఉంటుందని, సంఘాల్లో అవగాహన ఉంటే ఈ విధానం మంచిదేనని తెలిపారు. జిల్లాలో స్త్రీనిధి రుణాలు ఎక్కువ మొత్తంలో జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

పూర్తయిన సీట్ల కేటాయింపు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్–2024 తుది విడత కౌన్సెలింగ్ అలాట్‌మెంట్‌లను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం సాయంత్రం ప్రకటించింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తుది విడతలో సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య కళాశాలల్లో చేరాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా, 752 సీట్లకు 557 ప్రవేశాలు జరిగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 295 సీట్లకు 275, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో 99 సీట్లకు 94, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 132 సీట్లకు 126, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 118 సీట్లకు 38, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో 108కి 24 ప్రవేశాలు జరిగాయి. ప్రైవేట్ కళాశాలలు ఐదు ఉండగా 1947 సీట్లకు 805 ప్రవేశాలు జరిగాయి. టెక్కలి ఐతం పాలిటెక్నిక్‌లో 462 సీట్లకు 370, ఎచ్చెర్ల వెంకటేశ్వర పాలిటెక్నిక్‌లో 462 సీట్లకు 347, చిలకపాలెం శివానీ పాలిటెక్నిక్‌లో 330 సీట్లకు 52, గూడెం నారాయణ పాలిటెక్నిక్‌లో 396కి 36, మందస టీవీఆర్ పాలిటెక్నిక్‌లో 297కి ఒక్క ప్రవేశం కూడా జరగలేదు. మొత్తం ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలు 10 ఉండగా, 2699 సీట్లకు 1362 ప్రవేశాలు జరిగాయి. ఖాళీ సీట్లలో స్పాట్ అడ్మిషన్ల కోసం త్వరలో నోటిఫికేషన్ వస్తుంది.

లుకలాంలో ఇసుక అక్రమ తరలింపు

- సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నాయకులు
- ట్రాక్టర్ ఇసుక రూ. 4 వేలకు విక్రయం



లుకలాం గ్రామ చివరన స్కూల్ భవనం వద్ద ఉన్న ఇసుక పోగు



వంశధార నదిలో పోగు చేసిన ఇసుక

నరసన్నపేట: మండలంలోని లుకలాం కేంద్రంగా ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో లుకలాంలో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోజూ వంశధార నది నుంచి ఇసుక తవ్వకాలు చేసి గ్రామ సమీపంలో పోగులు వేస్తున్నారు. మరుసటి రోజు ఇసుకను పరిసర గ్రామాలకు తరలిస్తున్నారు. గడిచిన పది రోజులుగా ఇదే విధంగా తంతు నడిపి రోజుకు రూ. 20 వేల నుంచి రూ.30 వేల వరకూ ఆర్జిస్తున్నారు. ఒక వేళ ఎవరైనా ప్రశ్నిస్తే తాము ఎమ్మెల్యే మనుషులమని చెప్పి తప్పించుకుంటున్నారు. మండలంలో వంశధార నదీ తీరంలో మిగిలిన గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ప్రస్తుతానికి నిలిచినా లుకలాంలో మాత్రం యథేచ్ఛగా జరుగుతున్నాయి.

అందుబాటులోకి రాని ఇసుక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలపైబడుతున్నా ఉచిత ఇసుక ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక విక్రయాలు చేస్తున్నా అవి అందరికీ లభించడం లేదు. ఒక వేళ లభించినా ట్రాక్టర్ ఇసుక నరసన్నపేటకు వచ్చే సరికి రూ. 6 వేలు అవుతోంది. దీంతో స్థానిక గృహ నిర్మాణ దారులు ఇసుక కోసం పక్క చూపులు చూస్తున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్న కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. లుకలాంలో చాలా మంది ఇప్పటికే రూ.లక్షలు వెనకేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ గ్రామంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా.. ఇప్పటి వరకూ సెబ్ అధికారులకు ఎవరూ దొరకలేదు. ఒక పథకం ప్రకారం ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి మండలంలోని కొత్తవలస నిమ్మతొర్లాడ గ్రామాల మధ్య నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సమాచారం ముందుగానే అందడంతో వారంతా పారిపోయారు. అదే దారిలో వస్తుండగా తెల్లవారుజామున ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి పార్వతీశ్వరునిపేట సమీపంలో ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఆ రెండు ట్రాక్టర్‌లు కొత్తవలస గ్రామానికి చెందినవిగా గుర్తించారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి మంగళవారం కేసు నమో దు చేసినట్లు తెలిపారు. అలాగే ఇసుకతో ఉన్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు, లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలకు చెందిన విద్యార్థినులు మరోసారి తమ ప్రతిభను కనబర్చారు. ఇటీవల వెలువడిన ఏపీ పీజీసెట్–2024 ఫలితాల్లో కళాశాలలోని వృక్షశాస్త్రం విభాగం విద్యార్థినులు అదిరేటి ర్యాంకులు సాధించి శభాష్ అనిపించారు. జంతుశాస్త్రంలో పేడాడ నీలిమ 35వ ర్యాంకు సాధించగా, వృక్షశాస్త్రంలో దుంపల మాధురి 23వ ర్యాంకు, పొలుముట పూజిత 23వ ర్యాంకు, జొన్న దేవయాని 29వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. పీజీలో గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, కాలేజీలను ఎంచుకున్నారు.

కళాశాలకు గర్వకారణంగా నిలిచారు

కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. పట్టుదల, అంకిత భావానికి ప్రణాళిక తోడైతే చదువులో ఉన్నతస్థాయిలో ప్రతిభ కనబర్చవచ్చని కళాశాల విద్యార్థినులు నిరూపించడంతో పాటు కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకులు, ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను మెచ్చుకున్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సీఓఈ ఆదిలక్ష్మి, బోటనీ హెచ్‌ఓడి ఎస్.రుద్రమరాణి, జువాలజీ హెచ్‌ఓడీ హేమ పద్మజ, అధ్యాపకులు డాక్టర్ వై.రవికుమార్, సీహెచ్ సునీత, ఎ.వైష్ణవి అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య



కిమ్స్‌లో మృతిచెందిన మధు బరోడా

మెళియాపుట్టి: మండలంలోని సుందరాడ గ్రామానికి చెందిన మధు బరోడా (25) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మధు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అదే విషయమై 20 రోజుల కిందట గ్రామానికి వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. మధు చెల్లెలికి కొన్నాళ్ల కిందటే పెళ్లయ్యింది. ఆమె వదిన ఇటీవలే చనిపోయింది. దీంతో తర్వాత పెళ్లి గురించి ఆలోచిద్దామని మధుకు తల్లిదండ్రులు వివరించారు. దీంతో కొన్నాళ్ల ఇంటిలో గొడవలు జరిగాయి. సోమవారం మళ్లీ యువకుడు తల్లిదండ్రులతో గొడవకు దిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తనతో తెచ్చుకున్న గడ్డి మందు సేవించి గ్రామానికి దూరంగా ఉన్న తోటలో పడిపోయి కనిపించాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం కిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి ప్రవుల్లో బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

యోగా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా అండ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తున్న ఏడాది యోగా పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. కోర్సులో చేరేందుకు డిగ్రీ అర్హత కాగా, ఫీజు స్ట్రక్చర్ రూ.10వేలుగా చెప్పారు. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు 30 శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. వర్సిటీ వెబ్ సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని, రూ. 200 ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

'జగదీశ్వరరావుకు దేశం రుణపడి ఉంటుంది'



జగదీశ్వరరావు భార్య సమతకు ధైర్యం చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

నందిగాం: దేశ రక్షణ కోసం ప్రాణాలను విడిచిన వీరజవాన్ సనపల జగదీశ్వరరావు చరిత్ర పుటల్లో నిలిచిపోతారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. సోమవారం జమ్ములోని దోడా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతాదళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన నందిగాం మండలం వల్లభరాయునిపాడుకు చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను వారు మంగళవారం కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భార్య సమత, తల్లిదండ్రులు, పిల్లలకు ధైర్యం చెప్పి దేశ ప్రజలంతా మీ వెంట ఉంటారని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎదురుకాల్పుల్లో జగదీశ్వరరావు మృతి చెందారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, దేశరక్షణలో ప్రాణాలు కోల్పోయిన జగదీశ్వరరావును దేశం యావత్తు గుర్తుంచుకుంటుందని తెలిపారు. వీరి వెంట నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె పాల్గుణరావు, జద్యాడ జయరాం, స్థానిక సర్పంచ్ మళ్ల సీతారాం, కవిటి ఎర్రన్న, చిన్ని జోగారావు, గ్రామస్తులు ఉన్నారు.

సీఏలో మెరిసిన జి.కరాపాడు విద్యార్థి



నర్తు రామకృష్ణ

కవిటి: చార్టెట్ అకౌంటెంట్(సీఏ)ను ఛేదించి జి.కరాపాడుకు చెందిన పేదింటి కుర్రాడు నర్తు రామకృష్ణ అరుదైన విజయం సాధించాడు. 2024 మే నెలలో జరిగిన సీఏ ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తన లక్ష్యాన్ని సాధించాడు. హీరోమోటార్ కార్పొరేషన్‌లో సీనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గొండ్యాల సంతోష్, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ గొండ్యాల జానకిరామయ్యలు అందించిన ఆర్థిక సాయం వల్లనే తాను ఈ విజయం సాధించగలిగానని రామకృష్ణ తెలిపారు. తన తల్లి తులసమ్మ కూరగాయలు విక్రయిస్తూ తనను చదివించిందని, కానీ ఈ విజయం సాధించే వేళకు ఆమె లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణ తండ్రి కూడా చిన్నప్పుడే చనిపోయారు. రామకృష్ణ రాజపురం బీసీ బాలుర వసతిగృహంలో చదువుకుంటూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పూర్తిచేశాడు. ఎస్ఎస్ టీచర్ బల్లెడ శాంతమూర్తి మాస్టారు తరగతిలో సీఏ కోర్సు కోసం చెప్పిన మాట తన జీవితాన్ని మార్చిందని తెలిపాడు. అమ్మ పంపిన డబ్బుతో స్నేహితుల సహకారంతో చదువులు పూర్తి చేశానని, సరిగ్గా సీఏ ఫైనల్‌కు సన్నద్ధమవుతున్న దశలో అమ్మ మరణవార్త తనలో తీవ్ర దుఃఖాన్ని నింపిందని చెప్పాడు. మేనమామ సహాయసహకారాలతో సీఏ ఫైనల్ ఇటీవలే పూర్తి చేసుకోగలిగానని, తన జీవితంలో కూడా సాధ్యమైనంతమంది పేదవారికి విద్యాదానం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని సాక్షికి వివరించాడు.

'బలవంతపు రుణ రికవరీ తగదు'



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో రుణాలు పొందిన లబ్ధిదారుల నుంచి బలవంతంగా రికవరీ చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో పాటు మిగతా జిల్లాల్లో కూడా ఇదే ఆదేశాలు జారీ చేయాలని ఓ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ప్రకటన చేశారని తెలిపారు. బలవంతంగా రుణాల వసూళ్ల ప్రక్రియను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణాల వసూళ్ల పేరుతో దళితులను ఇబ్బందులకు గురిచెయ్యడం తగదన్నారు. బలవంతంగా వసూలు చేస్తున్న ఎండీ ఇతర అధికారులపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, దళిత, గిరిజనులకు ఇచ్చిన రుణాలను మాఫీ చెయ్యాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని దళితులు స్వేచ్ఛగా జీవించే మార్గాన్ని కల్పించిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి జోక్యం చేసుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులే కీలకం

- వర్షాభావ పరిస్థితుల్లో జాగ్రత్తలు అవసరం
- నారును ప్రత్యేకంగా చూసుకోవాలని అధికారుల సూచన



నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరి నారు

సరుబుజ్జిలి:

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కాలువల ద్వారా సాగునీరు అంతంత మాత్రమే అందడం వల్ల వరి నారు ఎండిపోవడంతో పాటు పలుచోట్ల ముదిరిపోతోంది. జిల్లాలో ఆమదాలవలస, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో వర్షాలు తక్కువగా కురిశాయి. ముదురు వరి నారు నాటేటప్పుడు రైతులు తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి మెట్ట పద్మనాభం సలహాలు అందించారు.

యాజమాన్య పద్ధతులివే..

- 35 నుంచి 50 రోజుల నారు వయసు ఉంటే చదరపు మీటరుకు 44 కుదుళ్లు, 50 నుంచి 65 రోజుల నారు వయస్సు ఉంటే చదరపు మీటరుకు 66 కుదుళ్లు వచ్చేలా వరి మొనలు వేసుకోవాలి.
- ముదురు నారు నాటితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అందువల్ల నాట్లు తక్కువ లోతులో నాటితే పిలకలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.
- ముదురు నారు నాటేటప్పుడు నిర్ణీత విస్తీర్ణంలో కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు దగ్గర దగ్గర 4 నుంచి 5 మొక్కలు వంతున నాట్లు వేయాలి.
- ముదురు నారు నాటేటప్పుడు సిఫార్సు చేసిన మోతాదు కంటే 25 శాతం పెంచి 3 దఫాలుగా కాకుండా 2 దఫాలుగా అంటే 70 శాతం ఆఖరి దమ్ములోనూ ఎకరానికి 50 కిలోల డీఏపీ, 35 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, మిగతా 30 శాతం 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ అంకురం దశలో వాడాలి.
- నత్రజని ఎరువులను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36–48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- నారు నాటడానికి సిద్ధం చేసేటప్పుడు నారు కట్టల చివర్లు తుంచి నాటాలి.
- ఇలా చేయడం వల్ల నారులో ఉండే కీటకాలను నియంత్రించవచ్చు. ముఖ్యంగా కాండం తొలుచు పురుగు ఆకు కొనలపై పెట్టిన గుడ్లు నాశనం అవుతాయి.
- నారు నాటిన తర్వాత ప్రతి 2 మీటర్లకి 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు తీయాలి.
- దీని వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉద్ధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు.
- ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులను వేయడానికి ఇంకా పైరు స్థితిగతులను గమనించడానికి ఈ కాలిబాటలు బాగా ఉపయోగపడతాయి.
- ఈ కాలిబాటలు నాటే సమయంలోను లేదా నాటిన 5 రోజుల లోపు తీసుకోవాలి.
- నాటిన 15 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 8 కిలోలు చొప్పున వేసుకుంటే తొలి దశల్లో కాండం తొలుచు పురుగు ఉద్ధృతి నియంత్రించవచ్చు.

పాఠశాల గోడ కూల్చివేతపై ఆందోళన



పాఠశాలలో కూల్చేసిన గోడను చూపిస్తున్న నిర్వాసితులు

ఎల్ఎన్ పేట: మండలంలోని తాయిమాంబాపురం (గార్లపాడు) వంశధార పునరావాస కాలనీలో ప్రాథమిక పాఠశాల తరగతి గది గోడను మండల విద్యా శాఖ అధికారి (ఎంఈఓ–1) సీహెచ్ మణి కుమార్ కూలగొట్టడం వివాదాస్పదమైంది. వంశధార నిర్వాసితులు అక్కడకు చేరుకుని మంగళవారం ఆందోళన చేశారు. 1999లో ఎల్.ఎన్.పేట మండలం కొత్తగా ఏర్పడింది. అప్పటి నుంచి మండల విద్యా శాఖకు సంబంధించిన అన్ని వ్యవహారాలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోనే కొనసాగిస్తున్నారు. ఎంఈఓ–1గా సీహెచ్ మణికుమార్ వచ్చిన తర్వాత మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న తాయిమాంబపురం (గార్లపాడు) పునరావాస కాలనీలోని ప్రాథమిక పాఠశాలను పరిపాలన కార్యాలయంగా ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల కిట్లు పంపిణీ కోసం స్టోర్ రూమ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచే కిట్లు పంపిణీ చేశారు. మరో అడుగు ముందుకు వేసి పాఠశాలను ఎమ్మార్సీగా మార్చేందుకు సిద్ధమయ్యారని నిర్వాసితులు గవర గోవిందరావు, అగతముడి జీవరత్నం, జాయి భూపతి, జి.అనంతరావు, సురవరపు సింహాచలం, బి.శేషగిరి, బి.గోవిందరావు తదితరులు ఆరోపించారు. రెండు అంతస్తుల్లో ఉన్న పాఠశాలలో పైన రెండు తరగతి గదులు ఉన్నాయి. ఈ రెండు గదులకు మధ్యలో గోడ కూల్చేందుకు ఎంఈఓ సిద్ధమయ్యారని, విషయం తెలుసుకున్న తాము వెళ్లి అడ్డుకున్నామని నిర్వాసితులు తెలిపారు. ఎంఈఓ మణికుమార్ చర్యలపై జిల్లా కలెక్టర్, సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఎంఈఓ స్పందిస్తూ కూల్చివేసిన గోడను తిరిగి కట్టిస్తానని తెలిపారు. పరిపాలనా పరంగా మండల కేంద్రంలో విద్యా శాఖకు సరైన భవనం లేనందున ఈ పాఠశాలను ఎమ్మార్సీగా వినియోగించుకోవాలని అనుకున్నామన్నారు. ఎమ్మార్సీగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నిధులు ఇస్తామని అన్నారని, అందుకే గోడ కూలగొట్టే పనులు చేపట్టానని తెలిపారు.

కాగువాడ అమ్మవారి ఆలయంలో చోరీ



కాగువాడ త్రిపురసుందరీదేవి విగ్రహం



అమ్మవారి ఆలయంలో హుండీని విరగ్గొట్టిన దొంగలు

పాతపట్నం: కాగువాడ గ్రామంలో ఉన్న శ్రీ లలితా త్రిపురసుందరీదేవి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. త్రిపురసుందరీదేవి ఉత్సవ విగ్రహానికి అలంకరించిన వెండి, బంగారం వస్తువులు, హుండీల్లో సుమారు రూ.50 వేలు నగదును దొంగిలించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో సోమవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో ముగ్గురు యువకులు వచ్చి చోరీ చేసినట్లు నిక్షిప్తమైంది. ఆలయంలోని ప్రధాన సేఫ్టీ(గ్రిల్స్) తలుపుల తాళాలు విరగ్గొట్టి లోపల ఉన్న వెండి ఆభరణాలు, వెండి గొడుగు నాలుగున్నర కేజీలు, శంఖం, పంచ పాత్రలు, ఉద్ధరిణి, రెండు గిన్నెలు, వెండి సింహాసనంతో పాటు బంగారు నల్ల పూసలు, శత మానాలు రెండు వస్తువులు, మూడు తులాల బంగారం దొంగతనం చేశారని, అలాగే రెండు హుండీల్లో సుమారు నగదు రూ.50వేలు ఉంటుందని ఆలయ అర్చకుడు నుసరావు రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఆలయం మూసి వేసి ఇంటికి వెళ్లామన్నారు. మంగళవారం వేకువజామున ఆలయానికి వెళ్లే సరికి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి, స్థానికులకు, గ్రామ పెద్దలకు, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కాగువాడ ఆలయానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.

దివ్యాంగులకు జాతీయ ఉపకార వేతనం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత ప్రభుత్వం సామాజిక న్యాయం సాధికారత శాఖ 2024–25 విద్యా సంవత్సరానికి అందించే ప్రీమెట్రిక్ ఉపకార వేతనం కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఏడీ కె.కవిత తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్ స్కాలర్‌షిప్‌డాట్ గోవ్‌డాట్‌ఇన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి వరకు గల విద్యార్థులు అర్హులని, దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఇంటర్ నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ ఉపకార వేతనం కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు పరిశీలించారు. మహిళలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్‌ఐ ఎస్.చిరంజీవికి సూచించారు. స్టేషన్‌లో అన్ని గదులు పరిశీలించారు. మండలంలో మొత్తం గ్రామాల్లో శాంతి భద్రతల పరిస్థితి, ప్రత్యేకంగా క్రైమ్ రేటు ఉన్న గ్రామాలు వంటి వాటిపై సిబ్బందితో సమీక్షించారు. జాతీయ రహదారిపై నిరంతరం నిఘా ఉంచాలని, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.